క్లుప్తంగా

ఆర్ఎస్ఐ కల్పనకు సన్మానం



కల్పన, బాషాను సత్కరించిన మాస్టర్ నాయబ్

పోరుమామిళ్ల: కర్నూలులో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న కల్పన అస్సాం రాష్ట్రంలో గౌహతిలో జరిగిన ఆల్ఇండియా జూడో క్లస్టర్ 2024 పోటీల్లో తైక్వాండో కరాటే, పెన్ కాక్ సిలాట్ గేమ్స్‌లలో పతకాలు సాధించారు. పోరుమామిళ్లలో మాస్టర్ నాయబ్ రసూల్ వద్ద కల్పన శిక్షణ పొందారు. అలాగే రసూల్ వద్ద శిక్షణ పొందిన యువకుడు మహబూబ్‌బాషా ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. బాషా ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు. జాతీయస్థాయిలో పోరుమామిళ్ల పేరు నిలబెట్టడమే కాకుండా రాష్ట్ర పోలీస్ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేసిన కల్పనను, కోచ్‌గా వ్యవహరించిన బాషాను శుక్రవారం పోరుమామిళ్లలో మాస్టర్ నాయబ్ శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు గోవర్ధన్, అంజనేయులు, బాలు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ తప్పనిసరి

రాజుపాళెం : గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేపించాలని రాజుపాళెం, పెద్దముడియం మండలాల పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 3,500 జీవాలకు వ్యాక్సిన్ వేశామన్నారు. ఉచితంగానే వ్యాక్సిన్ వేస్తున్నామని, వ్యాక్సిన్ వేయించని వారు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్టీపీపీకి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలో భద్రపరిచారు. అలాగే రాజుపాలెం మండలం గోపల్లెలో మృతిచెందిన మరొక వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ అధ్యక్షుడు మోరే లక్ష్మణరావును సంప్రదించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు ఫౌండేషన్ పట్టణాధ్యక్షుడు సుబహాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, అహ్మద్ హుసేన్, కార్యదర్శి నరేంద్రలు హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న స్వీపర్ల వేతనాల్లో కోత విధిస్తున్న విక్టర్ అసోసియేషన్ ప్రొప్రైటర్, కాంట్రాక్టర్ వాసుదేవ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్లకు రూ.11,202 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.9,100 ఇచ్చి, తిరిగి రూ.3 వేలు వెనక్కి తీసుకోవడం అన్యాయమన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా కట్టడం లేదని తెలిపారు. బస్సులను క్లీన్ చేస్తున్న కార్మికులకు కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి సాల్మాన్, అధ్యక్షుడు చంటి, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పెద్దముడియం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్ట్ తరఫున వారి కుమారుడు లక్ష్మిరెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పదవ తరగతి పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన జమాల్‌బాషాకు రూ.15000, రెండవ స్థానంలో వచ్చిన గురుపూజితకు రూ.10000, మూడవ స్థానంలో వచ్చిన పద్మావతి, షాహిదాకు చెరో రూ.5000 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులుంటే.. జరభద్రం!

మనిషి మనుగడలో జంతువులు, పక్షులు ఓ భాగం అయ్యాయి. జీవనోపాధి కోసం కొందరు. మరి కొందరు ఆసక్తితో ఇష్టంతో పెంచుతుంటారు. అయితే జంతువుల నుంచి ప్రాణాంతమైన వ్యాధులు సంక్రమిస్తాయని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 1885 జూలై 6న ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జూనోటిక్ వ్యాధి రేబిస్‌కు మొట్ట మొదటి సారిగా వ్యాక్సిన్ కొనుగొన్నారు. నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

- జూనోటిక్ వ్యాధులు సోకే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



కొర్రపాడులో పశువైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న వెంకటేశ్వర్లు, సిబ్బంది (ఫైల్)

రాజుపాళెం : మనిషికి సోకే వ్యాధులు కోకొల్లలు. ఏ వ్యాధి ఎప్పుడు మనిషి ఆరోగ్యాన్ని కాటేస్తుందో అర్థమవ్వని పరిస్థితి. చివరకు పశుపక్షాదుల నుంచి సుమారు 180 రోగాలు మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉంది. జంతువుల పెంపకం మంచిదే... అయితే జరభద్రం అంటున్నారు పశువైద్య నిపుణులు. పశుపక్షాదులతో నిత్యం మెలిగే పశువైద్యులు, రైతులు, జంతువధశాల కార్మికులు జంతు ప్రేమికులకు జూనోటిక్/జూనోసిస్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలను అప్రమత్తం చేయడం కోసమే ప్రతి ఏటా 6వ తేదీన జూనోసిస్ డే గా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీ. కుక్క కాటు బారిన పడిన ఓ బాలుడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు జులై 6 కావడంతో ఇదే రోజున ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవంగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని రాజుపాళెం, పెద్దముడియం మండలాల పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

యాంటి రేబిస్ టీకాలు సిద్ధం: పశు వైద్యశాలలు, ప్రాంతీయ వెటర్నటీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో జూనోసిస్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం జూలై 6వ తేదీన ఉచితంగా టీకాలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 5.70 లక్షల యాంటి రేబిస్ టీకాలు సిద్ధం చేసిందని అధికార యంత్రాంగం తెలిపింది. పశు పక్షాదుల నుంచి సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు చికిత్సల గురించి, వేయాల్సిన టీకాల గురించి పెంపకం దారులు, రైతులకు తెలియజేసేందుకు రైతు సేవా కేంద్రాలు, పశువైద్య శాలల్లో సిబ్బంది వివరిస్తున్నారు.

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు

పశుపక్షాదుల పెంపకం దారులు, జంతు పక్షులను వధించే వారికి రేబిస్, మెదడువాపు వ్యాధి, హైపటైటిస్, పాక్స్, డెంగీ ఫీవర్ మొదలైన వ్యాధులు సంభవించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో అత్యంత ప్రమాదకమైనది రేబిస్ వ్యాధి అని పశు వైద్యులు నిర్ధారించారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించేందుకు పశువైద్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వ్యాధులు సంక్రమించకుండా టీకాలు

జూనోటిక్ వ్యాధులతో మానవాళి మనుగడకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా పశుసంవర్ధకశాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధుల పట్ల మరిన్ని సలహాలు సంప్రదించడం కోసం ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా రేబిస్ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులైన కుక్కలకు టీకాలు వేయించాలి.

– డాక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు,
పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్,
పెద్దముడియం, రాజుపాళెం మండలం

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

దువ్వూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నం పేర్కొన్నారు. శుక్రవారం దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్, ఓపెన్ ఫోరం బహిరంగ సభ నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులు, సిమెంటు రోడ్లు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన పనులపై పది రోజుల నుంచి సోషల్ ఆడిట్ బృందం గ్రామాల వారీగా పనులను తనిఖీ చేశారు. వారి తనిఖీ నివేదికను ఓపెన్ ఫోరంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ నాగరత్నం మాట్లాడుతూ దువ్వూరు మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఈజీఎస్ నిధుల కింద 952 పనులను రూ.6,53,08,818, పీఆర్ కింద 95 పనులను రూ.1,86,38,395, ఏపీడబ్ల్యూఐడీసీ నిధుల కింద ఒక పనిని రూ.2,53,656తో మొత్తంగా రూ.8,42,00,869 ఖర్చు చేసినట్లు వివరించారు. ఇందులో మస్టర్లలో అవకతవకలు జరిగిన రూ.25,729 రికవరీ చేశామన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన కృష్ణంపల్లె, వెంకుపల్లె గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.7వేలు జరిమానా విధించామని తెలిపారు.

పర్యావరణ పరిక్షణతోనే మానవ మనుగడ



పశువైద్య కళాశాల ఆవరణలో కొబ్బరి చెట్టు నాటుతున్న కళాశాల అధ్యాపకులు

ప్రొద్దుటూరు : పర్యావరణ పరిరక్షణతోనే మానవుల మనుగడ ఆధారపడి ఉందని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశువైద్య కళాశాల ఆవరణలో వనమహోత్సవం వారంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొబ్బరి చెట్లను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. పర్యావరణం కాలుషితం కాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ వాణి, డాక్టర్ జ్యోతి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మానస, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

హోటళ్లలో పరిశుభ్రత లేకుంటే చర్యలు



మైదుకూరులోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

మైదుకూరు : హోటళ్లు, స్వీట్ బేకరీలలో పరిశుభ్రత పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని హోటళ్లు, బేకరీలను తనిఖీ చేశారు. హోటళ్లలో భోజనం, తినుబండారాలను తయారు చేసే వంటగదులను శుభ్రంగా ఉంచాలని, బేకరీలలో వంట గదులను శుభ్రంగా ఉంచి తినుబండారాలను తయారు చేయాలని సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

పట్టణంలోని హోటళ్లు, దుకాణాలు, బేకరీలలో ప్లాస్టిక్ కవర్లను విక్రయించినా, వినియోగించినా భారీ జరిమానా తప్పదని కమిషనర్ జబ్బార్ మియా స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను నిషేధించినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. శుక్రవారం సీజనల్ వ్యాధులపై మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, మండల విద్యాశాఖ అధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ బడికిపోదాం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం 6 నుంచి 14 సంవత్సరాల్లోపు బాలబాలికలు కచ్చితంగా చదువుకోవాలని బడికిపోదాం అనే కార్యక్రమాన్ని జూన్ 13 నుంచి జులై 12వ తేదీ వరకు నిర్వహిస్తోందని కడప ఎంఈఓలు దుద్దికుంట గంగిరెడ్డి, షేక్ ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం కాగితాలపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులతో కడప ఎంఈఓలు, విద్యార్థులతో కలిసి మనం బడికిపోదాం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నుంచి మనం బడికిపోదాం నినాదంతో ఐటిఐ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ బడి ఈడు వయసున్న పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. సీఆర్‌పీలంతా బడిఈడు పిల్లల కోసం సర్వే చేసి బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



భస్మాభిషేకంలో అగస్త్యేశ్వరుడు



దీపాలంకరణలో చాముండేశ్వరి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. రాత్రి అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దీపలక్ష్మిపూజ

స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చాముండేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విశేషంగా అమ్మవారి మూలవిరాట్‌ను దీపాలతో అలంకరించి దీపలక్ష్మీ పూజ, ధనలక్ష్మీ పూజ నిర్వహించి దశవిధ హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు



మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

పేషెంట్ల నుంచి డబ్బు తీసుకోవద్దు



నవజాత శిశు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి డబ్బు తీసుకోకుండా కట్టడి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగాలు, లేబర్ వార్డు, ఫార్మసీ, ఎమ్మార్ఐ, సిటి స్కాన్‌తో పాటు ఐపీ వార్డులను పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో సిబ్బంది కొరత, కావలసిన పరికరాల గురించి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో వసతులు బాగున్నాయని కితాబిచ్చారు. పారిశుద్ధ్యం మెరుగుపడాలని సూచించారు. ఇక్కడ వైద్యులు ఉన్నా నర్సింగ్, ఇతర విభాగాల్లో సిబ్బంది కొరత ఉందని ప్రొద్దుటూరు వాసి అయిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కాలేజీ విషయం కూడా మంత్రితో చెప్పానని, కాలేజీ సాధించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

నాడు–నేడు పనులపై విచారణ చేపట్టాలి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కింద చేసిన పనులపై విచారణ చేపట్టాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. రాజుపాళెంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు–నేడులో భాగంగా పర్లపాడు జెడ్పీ హైస్కూల్‌కు రూ.42 లక్షలు కేటాయించారన్నారు. అయితే విడతల వారీగా బిల్లుల రూపంలో ఇప్పటి వరకు దాదాపు రూ.16 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఖర్చు చేశారని తెలిపారు. ఈ పనుల విషయంలో అవకతవకలు జరిగాయని, ఇక్కడి పాఠశాల హెచ్ఎం, అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించండి

కడప అర్బన్: ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారుడు సీటుబెల్ట్ పెట్టుకోవాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలియజేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి ఆదేశానుసారంగా శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.

తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలి



చాపాడు: చిన్నగురువళూరు బీసీ హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



బద్వేలు అర్బన్ : పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

చాపాడు: ఇళ్లతో పాటు ప్రభుత్వ వసతి గృహాలలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో శుక్రవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంతో పాటు ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని చిన్నగురువళూరులోని బీసీ బాలుర వసతి గృహంలో పరిశీలనలు చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు దోమల వలన వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరంలో హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకును పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబుల్‌రెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి నాగకుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

బద్వేలు అర్బన్ : సీజనల్, కీటకజనిత వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు డయేరియా, కీటకజనిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలలోని మరుగుదొడ్లను ప్రతిరోజు శుభ్రం చేయాలని కోరారు. పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు తయారు చేయాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడులు



దువ్వూరు : పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు : మైదుకూరు పట్టణం, మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. తిరుపతి ఏడీఏ (ఎస్టీల్) కేఎంఈ ప్రసాద్, కడప విజిలెన్స్ సీఐ ఈదురు బాషా, స్థానిక వ్యవసాయ అధికారులు కృష్ణమూర్తి, పి.ప్రసన్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపుల్లో రికార్డులను తనిఖీ చేశారు. కొన్ని కంపెనీల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసి, రూ.8,700 విలువల గల మందులను సీజ్ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

దువ్వూరు : దువ్వూరులోని పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా, తిరుపతి అగ్రికల్చర్ భూసార పరీక్ష కేంద్రం అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీ చేశారు. శ్రీకాశిరెడ్డి నాయన ట్రేడర్స్, లక్ష్మీ వెంకటరమణ ఏజెన్సీలలో సరైన పత్రాలు, అనుమతులు లేని బయో పురుగు మందులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. అనుమతులు లేని పురుగు మందులు ఎవరైనా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గల ఆటోస్టాండ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు భారీ జరిమానాలు విధించేలా రూపొందించిన జీఓ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రీన్ ట్యాక్స్, ఈ–చలానాలు రద్దు చేయాలని కోరారు. అలాగే పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించి ఆటో కార్మికులకు అండగా నిలవాలని, ఆదుకోవాలని కోరారు. అలాగే ఆటో విడి భాగాలపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాల్, పెంచలయ్య, వెంకటసుబ్బయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



కాశినాయన : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి



కలసపాడు : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు



బ్రహ్మంగారిమఠం: సదస్సులో మాట్లాడుతున్న ఓఎస్టీ మాధవీలత

కాశినాయన : భారతీయ నూతన చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పోరుమామిళ్ల ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మిదేవి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అన్ని రకాల చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించుకోవడం ద్వారా మహిళలు నిర్భయంగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, హెడ్ కానిస్టేబుల్ ఖాదరయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

కలసపాడు : గ్రామాల్లో చట్టాలపై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన కొత్త చట్టాలు భారత న్యాయ సంహిత, భారత నాగరిక సురక్ష సంహిత, భారత సాక్షి అభియాన్ చట్టలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణకుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మిదేవి, సూపర్‌వైజర్ హరిప్రియ, ఏఎస్ఐ నాగేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బ్రహ్మంగారిమఠం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన చట్టాలపై శుక్రవారం బి.మఠంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సంరక్షకులు, అంగన్‌వాడి కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓఎస్టీ మాధవీలత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళల పట్ల వేధింపులు, అత్యాచారాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సావిత్రమ్మ, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, అంగన్‌వాడీల సూపర్‌వైజర్లు శారద, ప్రత్యూష, గ్రామ సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.